విజృంభిస్తున్న విష జ్వరాలు!

- జ్వర పీడితులతో నిండిపోతున్న ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు
- ప్రభుత్వ దవాఖానాల్లో అరకొర సిబ్బంది
- రోగులకు తప్పని ఇబ్బందులు


ఓపీ క్యూ లైన్‌లో వేచి ఉన్న రోగులు

నల్లకుంట: హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. జ్వరాలతో బాధపడుతూ నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు రెట్టింపు అవుతోంది. ప్రతిరోజు 800కు పైగా ఓపీ నమోదు అవుతుందంటే అందులో సింహభాగం జ్వరాల కేసులే ఉంటున్నాయి. ముఖ్యంగా పాతబస్తీ, ముషీరాబాద్, అంబర్‌పేట నుంచి ఎక్కువగా బాధితులు వస్తున్నట్లు చెబుతున్నారు. ఇవి కాకుండా బస్తీ దవాఖానాలను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. అదే స్థాయిలో ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఇదే అదునుగా కొందరు ప్రైవేటు వైద్యులు కాసుల పంట పండించుకుంటున్నారు. జ్వర పీడితుల్లో సుమారు 50 శాతం పదేళ్లలోపు చిన్నారులే కావడం ఆందోళన కలిగించే విషయం. ఉన్నట్టుండి ఒళ్లు వేడెక్కడం, నొప్పులు, నీరసానికి గురికావడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. దీంతో సహజంగా తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. జ్వరం ఒక్కోసారి ప్రాణాంతకం కావచ్చని తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఈ నెలలో 28వ తేది వరకు నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో 15,552 మంది రోగులు చికిత్సలు పొందారు. కాగా వారిలో అధిక శాతం విష జ్వరాల బారినపడిన వారే ఉండటం గమనార్హం. కాగా వారం రోజులుగా ఫీవర్‌కు రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. గత వారం రోజుల్లో నమోదైన ఓపీ కేసుల వివరాలు ఇలా ఉన్నాయి.

తేదీ	ఓపీ
23వ	305
24న	769
25న	431
26న	924
27న	1103
28న	1011

29న మధ్యాహ్నం వరకు 600 మందికి పైగా ఓపీలో చికిత్సలు పొందారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఫీవర్‌లో వైద్యుల కొరత..

సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న సమయంలో ఫీవర్ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఏర్పడింది. ఇటీవల వైద్యారోగ్య శాఖ చేపట్టిన సాధారణ బదిలీల్లో 16 మంది వైద్యులు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లారు. కాగా వారి స్థానంలో ఇప్పటి వరకు ఎవరూ రాలేదు. ప్రస్తుతం ఆసుపత్రిలో నలుగురు వైద్యులు మాత్రమే ఉన్నారు. కాగా ఇటీవల జూనియర్ వైద్యులు నిరసన కార్యక్రమాన్ని విరమించిన తర్వాత గాంధీ ఆసుపత్రి నుంచి 8 మంది పీజీ వైద్య విద్యార్థులను ఇక్కడకు పంపిస్తున్నారు. అందుబాటులో ఉన్న నలుగురు రెగ్యులర్ వైద్యులు, పీజీ విద్యార్థులతో ఓపీలో రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై నామమాత్రం ఫోకస్..

వర్షాలు కురుస్తుండటంతో దోమలు విజృంభిస్తోన్నాయి. ఫలితంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రధానంగా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉంది.




వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రక్తం, మూత్రం శాంపిల్స్ ఇచ్చేందుకు క్యూలో వేచి ఉన్న రోగులు

నివారణ చర్యలేవీ?

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్య, ఆరోగ్యశాఖ, సంబంధిత అధికారులు చేస్తున్న ప్రకటనలు మాటలే పరిమితం అవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్తీలు, కాలనీలలో వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోతున్నాయి. అలాగే ఆయా ప్రాంతాలల్లో చెరువులు ఉన్న చోట్ల దోమల లార్వా నిర్మూలనకు గంబూసీయా చేపలను వదలాల్సి ఉన్నా.. ఎక్కడా అటు వంటి దాఖలాలు లేవు. బస్తీలలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. కాగా ఆరోగ్య శిబిరాలను మొక్కు బడిగానే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం

విష జ్వరాల వ్యాప్తిపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. ఫ్రై డే డ్రై డే నిర్వహిస్తున్నాం. రక్త పరీక్షల సంఖ్య పెంచాం. బస్తీలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం. – నిరంజన్, మలేరియా అధికారి

రోగుల సంఖ్య పెరుగుతోంది..



ఇటీవల కాలంలో జ్వరాలతో చికిత్సల కోసం ఫీవర్ ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతోంది. ఈ నెలలో ఇప్పటి వరకు 15552 మంది ఆసుపత్రిలో చికిత్సలు పొందగా, వారిలో అధిక శాతం జ్వరాల భారినపడిన వారు ఉంటున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు సీజనల్‌గా వచ్చే జ్వరాలపై అప్రమత్తమై వైంటనే వైద్యులను సంప్రదించాలి. జ్వరం ఉంటే తక్షణ వైద్యంగా పారాసిటమల్ మాత్రమే వాడాలి. యాంటీబయోటిక్స్ జోలికి వెళ్లవద్దు, ద్రవ పదార్థాలు ఆహారంగా ఇవ్వాలి. కాచి చల్లార్చిన నీటినే తాగించాలి. ప్రతి సంవత్సరం ఫ్లూ టీకాలు వేయించాలి.

– డా.జయలక్ష్మి, ఫీవర్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్

చదువు ఒక శక్తిమంతమైన ఆయుధం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఈస్ట్ జోన్ అడిషినల్ డీసీపీ నర్సయ్య

అంబర్‌పేట: విద్యార్థులు కష్టపడే తత్వాని పెంపొందించుకోవాలని ఈస్ట్ జోన్ అడిషినల్ డీసీపీ నర్సయ్య తెలిపారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జరిగిన క్రీడాదినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజ్ఞానం ఒక అత్యుత్తమైన, శక్తివంతమైన ఆయుధమని, దాని ద్వారా విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకొవచ్చని ఆయన సూచించారు. ధ్యాన్‌చంద్ జయంతిని జరుపుకుంటూ క్రీడాల ప్రాముఖ్యతను, క్రీడా స్ఫూర్తిని విద్యార్థులకు తెలియజేయడం గొప్ప విషయం అన్నారు. కాచిగూడ ప్రభుత్వ కళాశాలలో తాను కూడా పూర్వ విద్యార్థి అని.. పాత జ్ఞాపకాలను గుర్తుకు వస్తున్నాయన్నారు. కార్పొరేటర్, ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయన్నారు. దేశంలోని ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత చదువులు చదివిన అనేక మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకున్న వారే కావడం గర్వకారణం అన్నారు. డ్రగ్స్ కల్చర్‌కు దూరంగా ఉంటూ గురువులు చెప్పే పాఠాలను శ్రద్ధగా చదువుతూ క్రమశిక్షణతో కష్టపడాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అలాగే క్రీడాదినోత్సవం సందర్భంగా క్రీడల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ లెక్చరర్స్ ప్రసాద్‌రావు, గీతభాయ్, రామ్‌మొహన్, అనిల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరలు పాల్గొన్నారు.

31న విద్యా సదస్సు

ట్రస్మా అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి


ట్రస్మా సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర కమిటీ నేతలు

కవాడిగూడ: ప్రస్తుత విద్యా విధానం – సమస్యలు విద్యారంగంలో ప్రభుత్వం ఆమోదం పొందిన ప్రైవేటు పాఠశాలల సమస్యలపై ఈనెల 31న నాగోల్‌లోని శుభం గార్డెన్స్‌లో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) రాష్ట్ర అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులకు విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు అన్ని జిల్లాల ట్రస్మా కరస్పాండెంట్ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కోదండరాం, ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎన్నం శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటున్నారని తెలిపారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చండి

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని గురువారం డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ కోరారు. ఈ మేరకు గురువరాం కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబుకు ఆయన వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగులకు చేయూత పథకం కింద రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను ప్రతిపాదికగా తీసుకుని అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దివ్యాంగులకు 5శాతం కేటాయించాలని కోరారు. ప్రతిశాఖలో 5శాతం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి బి.భారతి, ఉపాధ్యక్షులు కె.వెంకటేష్‌గౌడ్ తదితరులున్నారు.


రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న వల్లభనేని ప్రసాద్ తదితరులు

హనుమంతుగౌడ్ మృతి బీఆర్‌ఎస్‌కు తీరని లోటు


హనుమంతుగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ బీసీ సెల్ కార్యదర్శి హనుమంతుగౌడ్ పార్టీకి అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం ఎస్‌బీఐకాలనీలో హనుమంతుగౌడ్ సంతాప సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై హనుమంతుగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హనుమంతు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, సీనియర్ నాయకులు డి.శివముదిరాజ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పక్షాన పోరాడేది సీఐటీయూనే..

అంబర్‌పేట: కార్మికుల పక్షాన సీఐటీయూ ఎన్నో పోరాటాలు చేసిందని భవిష్యత్‌లో సహితం మరిన్ని పోరాటాలకు వెనుకడాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. వీరయ్య అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ నూతన కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేందుకు 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్ చట్టాలను తీసుకువచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక చట్టాలు యాజమాన్యాలకు అనుకూలంగా ఉంటూ కార్మికుల హక్కులను హరించేలా ఉన్నాయని అన్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో వేలాది మంది అసంఘటిత రంగ కార్మికులు, ఆటో డ్రైవర్‌లు, చిన్న పరిశ్రమాల్లో పనిచేసే కార్మికులు ఉన్నారని తెలిపారు. వారి హక్కుల కోసం సీఐటీయూ క్షేత్రస్థాయిలో పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అంబర్‌పేట ఇన్‌చార్జ్ మహేందర్, నాయకులు వెంకటేష్, రాములు, సుబ్బారావు, షాబానా, వరలక్ష్మి, ఎం.శ్రీనివాస్, నాగలక్ష్మి తదితరలు పాల్గొన్నారు.


అంబర్‌పేటలో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

మహిళలు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం మహిళలు చేసుకోవాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లీగల్ ఆఫీసర్ రఫియా సూచించారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ సిద్ధిఖ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఎస్ఆర్‌డీ సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వం పిల్లలు, మహిళలకు అందించే పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రఫియా మాట్లాడుతూ... చిన్నారులకు ప్రభుత్వం ఉచితంగా అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారం అందజేస్తుందన్నారు. అలాగే గర్భిణులు, బాలింతలకు సైతం పౌష్టికాహారంతో పాటు వైద్య సేవలు కూడా అందిస్తారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్‌డీ సంస్థ ప్రతినిధులు శివరాణి, ఇందిరాభారతి, వెంకటేశ్వరి, జబీన్, హాజీ పాషా తదితదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పరిధిలోకి వచ్చే పేదల ఇళ్లకు ప్రత్యామ్నాయం చూపాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైడ్రా పరిధిలోకి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ.. చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కబ్జాలకు పాల్పడిన రియల్ ఎస్టేట్ వ్యాపారం సంపాదించిన సొమ్మును రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో చెరువులు, కుంటలు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ వల్ల హైదరాబాద్‌ను సుందరీకరణ అభివృద్ధి కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా ద్వారా పేదలకు న్యాయం చేయాలన్నారు. హైడ్రా ద్వారా విలాసవంతమైన ఫామ్‌హౌజ్‌లు, రిసార్ట్స్‌లను తొలగించడానికి ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాన్ని తమ పార్టీ సమర్థిస్తున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో హైదరాబాద్ అభివృద్ధి కోసం తమ చెమటలను దారబోసిన పేద ప్రజల ఇళ్ల విషయంలో హైడ్రా నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కబ్జాలకు పాల్పడిన రియల్ ఎస్టేట్ వ్యాపారుల మాటలు నమ్మి లక్షలాది మంది మధ్యతరగతి ప్రజలు అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు కోనుగోలు చేసి మోసపోయారన్నారు. ఒకవేళ హైడ్రా పరిధిలో పేద ప్రజలకు వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని కోరారు.

లైఫ్స్ గుడ్ స్కాలర్ షిప్ ప్రోగ్రామ్

సాక్షి, సిటీబ్యూరో: బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ప్రముఖ బ్రాండ్ ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ లైఫ్స్ గుడ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించింది. ఆర్థిక సహాయం ద్వారా విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పడేలా ఈ స్కాలర్‌షిప్ ప్రదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. దేశ వ్యాప్తంగా ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు.

మెరుగైన సేవలు అందించినప్పుడే గుర్తింపు

ముషీరాబాద్: ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే సమాజంలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. గురువారం ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారిగా నూతనంగా నియమితులైన డా. మనోజ్‌రెడ్డి కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా నల్లవెల్లి అంజిరెడ్డి మాట్లాడుతూ.. పేదల నివసించే ప్రాంతాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరారు. అందుకు వైద్యులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎంలు విజయకుమారి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ నిర్మాణ దాతలకు ఆశీర్వచనం



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని ప్రసిద్ధ గాంచిన లక్ష్మీగణపతి దేవాలయంలో కాంగ్రెస్ నగర ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, చంద్రకళ దంపతులు సొంత నిధులను వెచ్చించి ఆలయ ప్రహరీని నిర్మించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈవో పి.లక్ష్మారెడ్డి, నేతలు కృష్ణ, అభిషేక్ కెనడీ, కెనడీ రాజు, భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కంగనా రనౌత్‌పై ఫిర్యాదు



అంబర్‌పేట: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై ఎంపీ, సినీ నటి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలంటూ మాజీ ఎంపీ వి.హనుమంతరావు అంబర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంగనా రనౌత్ బాధ్యత రహితంగా ఒక ప్రతిపక్ష నేతపై వ్యాఖ్యలు చేయడంపై తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వీహెచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్ష్మణ్ యాదవ్, పులిజగన్, రామ్‌మోహన్, శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

నూతన పైపులైన్ పనులు ప్రారంభం

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని జవహర్‌నగర్‌లో నూతన పైపులైన్ పనులు గురువారం ప్రారంభమయ్యాయి. వరదనీటితో ఇబ్బందిపడుతున్న ప్రజల అవస్థలు పైపులైన్ నిర్మాణంతో తొలగనున్నాయి. జీహెచ్ఎంసీ విభాగం పర్యవేక్షణలో జరుగుతున్న పనులను కార్పొరేటర్ పావని సూచన మేరకు వినయ్‌కుమార్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ నాయకులు సాయికుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, దినేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులను పర్యవేక్షిస్తున్న వినయ్‌కుమార్, అధికారులు

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. సీఐతో పాటు ఎస్ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది హాజరై నివాళులర్పించారు.


భాస్కర్ పార్థివదేహానికి నివాళి అర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య, సిబ్బంది

ఏ1 టీ కంపెనీకి ఉత్తమ టీ పౌడర్ అవార్డు



స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా అవార్డు స్వీకరిస్తున్న ఏ1 టీ కంపెనీ డైరెక్టర్లు

అంబర్‌పేట: ఆహార ఉత్పత్తుల్లో ఏ1 టీ ఫౌడర్ కంపెనీ ఉత్తమ టీ–ఫౌడర్ అవార్డును సొంతం చేసుకుంది. హైబిజ్ టీవీ ప్రాతిష్టాత్మకంగా ఇచ్చే అవార్డులలో ఆహార ఉత్పత్తుల విభాగంలో ఏ1 టీ కంపెనీ గెలుచుకుంది. ఈ అవార్డును ఇటీవలే తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ చేతుల మీదుగా ఏ1 టీ కంపెనీ డైరెక్టర్లు జాకీ పటేల్, జాకీర్ పటేల్‌లు అందుకున్నారు. అవార్డు వచ్చినందుకు కంపెనీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

యూనివర్సిటీల్లో టీచింగ్ సర్వీసును క్రమబద్ధీకరించాలి

ముషీరాబాద్: యూనివర్సిటీల్లో టీచింగ్ సర్వీసును క్రమబద్ధీకరించాలని తెలంగాణ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 15 రోజుల్లో అన్ని యూనివర్సిటీలకు వీసీలతో పాటు అధ్యాపకుల పోస్టులను నియమిస్తామని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. అయితే అధ్యాపకుల రెగ్యూలర్ రిక్రూట్‌మెంట్ చేపట్టడానికి ముందే ఆయా యూనివర్సిటీలలో దశాబ్దాలుగా పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రిని కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. పరశురామ్, డా. వంగరి భూమయ్య, శ్రీశైలం, డా. విజయకాంత్, డా. జితేందర్‌రెడ్డి, డా. తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి

చిక్కడపల్లి: సాహితీ సాంస్కృతిక సేవా సంస్థ రాగ రాగిణి ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో వంశీ సంస్థల అధినేత వంశీరామరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థ నిర్వాహకులు ఎంపీ రణకుమారి, ఎంపీ సుబ్బలక్ష్మి సోదరీమణులు సాంస్కృతిక రంగంలో ప్రత్యేక గుర్తింపును పొందారని ప్రశంసించారు. ఉత్తమ కార్యక్రమాలను నిర్వహిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ఎంఆర్. శశిరేఖ, మల్లాది ఉష, ఎంపీ సుబ్రహ్మణ్యం, జి.దినకర్‌రావు, పి.కమలాకరరావు, ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం


ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జాతీయ అధ్యక్షుడు వీపీ సాను

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ విద్యారంగాన్ని సంక్షోభం నుంచి కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు వీపీ సాను పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ తెలంగాణ కమిటీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వీపీ సాను మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో మైనార్టీలైనా హిందువులపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బెంగాల్‌లో విద్యార్థినిపై హత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు దేశంలో పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి పి.నాగరాజు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి, ఉపాధ్యక్షులు రజనీకాంత్, శ్రీకాంత్‌వర్మ, శంకర్, కిరణ్, పూజా, అశోక్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సమస్యకు పరిష్కారం

ముషీరాబాద్: డివిజన్‌లోని పటాన్ బస్తీలో నెల రోజులుగా కలుషిత నీటి సరఫరా వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని డివిజన్ బీఆర్‌ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ పర్వేజ్ జలమండలి డీజీఎం మోహన్‌రాజ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు గురువారం ఆధునిక టెక్నాలజీతో సమస్యను గుర్తించారు. వెంటనే కొత్త పైపులైన్ వేశారు. ఈ సందర్భంగా డీజీఎం మోహన్‌రాజ్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మంచినీటి సరఫరాను అందించేందుకు ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సెక్షన్ మేనేజర్ సురేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతా జూనియర్ డాక్టర్ హత్యాచార దుండగులను కఠినంగా శిక్షించాలని జాహ్నవి విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ ఏ.లక్ష్మి అన్నారు. గురువారం కళాశాల విద్యార్థినులతో కలిసి నారాయణగూడలో నిరసన ర్యాలీ నిర్వహించారు. దాడికి పాల్పడిన కిరాతకులను వదలొద్దని డిమాండ్ చేశారు. – సాక్షి, సిటీబ్యూరో